
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
బుధవారం 13 మార్చి 2024



ఆ కుర్చీలను మడతపెట్టారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

● గ్రీన్‌మ్యాట్ మాయం ● బోసిపోయిన సిద్దిపేట పేకాట క్లబ్ ● హాట్‌టాపిక్‌గా 'ఆంధ్రజ్యోతి' కథనం



గ్రీన్‌మ్యాట్‌ను తొలగించి పేకాటరాయుళ్లను అనుమతించకపోవడంతో నిర్మానుష్యంగా మారిన క్లబ్ (మంగళవారం నాటిది)

సిద్దిపేట టౌన్, మార్చి 12 : సిద్దిపేటలోని ఓ క్లబ్‌లో గుట్టుగా సాగుతున్న పేకాట దందాపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం హాట్‌టాపిక్‌గా మారింది. సోమవారం వరకు పేకాట రాయుళ్లతో కళకళలాడిన ఆ క్లబ్ మంగళవారం బోసిపోయింది. సిద్దిపేటలోని ప్రముఖులు, వ్యాపారులు, రాజకీయ నాయకుల్లో ఏ నలుగురు కలిసినా 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన "క్లబ్బులో గబ్బు" కథనంపైనే చర్చించారు. అప్రమత్తమైన క్లబ్ నిర్వాహకులు కింది అంతస్తులో ఏర్పాటు చేసిన గ్రీన్‌మ్యాట్‌లను తీసేశారు. అక్కడ ఏర్పాటు చేసిన టేబుళ్లను, కుర్చీలను మడతపెట్టారు. బయటి వ్యక్తులు ఎవరూ లోనికి రాకుండా ఇద్దరు సెక్యూరిటీ గార్డులను నియమించారు. పేకాట ఆడేందుకు వచ్చిన వారిని తిరిగి పంపించేశారు. అక్కడ అలాంటిదేం జరగడం లేదన్నట్లుగా పరిస్థితులను మార్చేశారు. అయితే, సిద్దిపేటలో గుట్టుగా జరుగుతున్న ఈ దందా ఇకనైనా మూతపడుతుందా? లేదా మళ్లీ మొదలవుతుందా అనేది వేచి చూడాలి.



క్లబ్‌లో గ్రీన్‌మ్యాట్ కట్టి పేకాట ఆడుతున్న దృశ్యం (సోమవారం నాటిది)

చేర్యాల మున్సిపల్ కమిషనర్‌పై సస్పెన్షన్ వేటు

● మంచిర్యాల జిల్లాలో పనిచేసిన సమయంలో అక్రమాలు



చేర్యాల, మార్చి 12: చేర్యాల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన టి.రమేశ్ సస్పెన్షన్‌కు గురయ్యారు. మంచిర్యాల జిల్లా నాస్‌పూర్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో ఇంటి అనుమతుల విషయంలో అక్రమాలకు పాల్పడడంతో ఇప్పుడు ఆయనపై వేటుపడింది. మున్సిపల్ డైరెక్టర్ మంగళవారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. రమేశ్ ఫిబ్రవరిలో మంచిర్యాల జిల్లా నాస్‌పూర మున్సిపాలిటీలో పనిచేసినపుడు పలు ఇళ్ల నిర్మాణ అనుమతుల్లో నిబంధనలు పాటించలేదన్న ఆరోపణలపై వరంగల్ ఆర్‌డీఎంఏ అధికారులు విచారణ చేపట్టారు. తొమ్మిది ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏడు ఇళ్లకు సిఫారసు చేశారు. మిగిలిన రెండు ఇళ్లకూ రమేశ్ అనుమతులు ఇచ్చినట్లు ఆరోపణలు రుజువు కావడంతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విచారణ చేపట్టిన అధికారులు సస్పెన్షన్ చేశారు. సంబంధిత ఉత్తర్వులను మంగళవారం కార్యాలయానికి పంపించారు. ఇటీవలే చేర్యాల మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన రమేశ్ ఇక్కడ కార్యకలాపాలు నిర్వహించేలోపే సస్పెన్షన్ గురవడం చర్చనీయాంశమైంది.



గుంటూరుపల్లి నుండి వేచరేణి మార్గంలో కాలిపోయిన చెట్లు


హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతి

చేర్యాల, మార్చి 12 : పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం హరితహారం ద్వారా మొక్కలు నాటుతుండగా సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా చేర్యాల, కొమురవెల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో అగ్నికి ఆహుతవుతున్నాయి. వ్యవసాయ దుక్కులు, రియల్‌ఎస్టేట్ వెంచర్లలో పిచ్చిమొక్కలు తొలగించేందుకు కొందరు నిప్పు పెడుతుండడంతో మంటలు వ్యాపించి రోడ్డుపక్కనున్న మొక్కలు దహనమవుతున్నాయి. నిన్నటి వరకు చేర్యాల పట్టణ శివారు గుంటూరుపల్లినుంచి వేచరేణికి వెళ్లే మార్గంతో పాటు కడవేరుగు శివారు పెట్రోల్‌బంక్ సమీపంలో రోడుకు ఇరువైపులా ఏపుగా పెరిగి పచ్చదనంతో ఆహ్లాదాన్నందించిన చెట్లు నేడు మాడి మసై దర్శనమిస్తున్నారు. కిష్టంపేట నుంచి కొమురవెల్లికి వెళ్లే మార్గంలోనూ హరితహారం చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఇతర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. గతంలో మొక్కలు తొలగించినా, వాటికి నిప్పు పెట్టినా జరిమానాలు విధించేవారు. ఈ విషయమై సంబంధిత అధికారులు స్పందించి భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని హరితప్రేమికులు కోరుతున్నారు.



కడవేరుగు శివారులో దహనమైన చెట్లు

పల్లెలు భేష్



మిట్టపల్లి గ్రామం

మొత్తం గ్రామపంచాయతీలు - 499 | పన్ను లక్ష్యం - రూ.11.28 కోట్లు

● పన్ను చెల్లింపులో ముందంజ
● రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిన సిద్దిపేట జిల్లా
● నూటికి నూరు శాతం పన్నుల చెల్లింపు
● చొరవ చూపిన ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 12: పన్ను వసూళ్లలో సిద్దిపేట జిల్లా రికార్డు సాధించింది. వందశాతం వసూళ్లతో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. గ్రామాల్లో పంచాయతీ పాలన ఫిబ్రవరి ముగిసినప్పటికీ నాటి నుంచి గ్రామపంచాయతీల బాధ్యతలు ప్రత్యేక అధికారులకు అప్పగించారు. దీంతో గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పన్నుల వసూలుకు కృషి చేశారు. వంద శాతం పన్ను వసూలు పూర్తి చేయడంతో గ్రామ పంచాయతీల ఖజానా కాసులతో కళకళలాడుతున్నది. వంద శాతం పన్నులు వసూలు చేసిన గ్రామపంచాయతీల్లో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలిచింది.



మిట్టపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

నూటికి నూరుశాతం

జిల్లాలో 499 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2023-24 సంవత్సరం గ్రామ పంచాయతీకి రావాల్సిన ఆస్తి పన్నుల వసూళ్లలో గడువు కంటే ముందే వంద శాతం పూర్తి చేశారు. జిల్లాలో ఆస్తి పన్ను లక్ష్యాన్ని పూర్తి చేసి రూ.11.28 కోట్లను వసూలు చేశారు.


కోహెడ మండలంలో 27 గ్రామ పంచాయతీల్లో రూ. 34,66,506, అక్కన్నపేట మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో రూ. 25,43,983, నారాయణపేట మండలంలోని 10 గ్రామ పంచాయతీల్లో రూ.19,78,601, దుబ్బాక మండలం 30 గ్రామ పంచాయతీల్లో రూ. 32,14,053, బెజ్జంకి మండలం 23 గ్రామ పంచాయతీల్లో రూ. 40,03,880, గజ్వేల్ మండలం 25 గ్రామ పంచాయతీల్లో రూ. 63,09,484, చిన్నకోడూర్ మండలం 25 గ్రామ పంచాయతీల్లో రూ. 54,69,627, దౌల్తాబాద్ మండలం 24 గ్రామ పంచాయతీల్లో రూ.21,74,833, హుస్నాబాద్ మండలం 17 గ్రామ పంచాయతీల్లో రూ.22,73,238, మద్దూరు మండలం మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో రూ.24,90,017 వసూలయ్యాయి. అలాగే మర్కుక్ మండలం 16 గ్రామపంచాయతీల్లో రూ.40,00,291, నంగునూరు మండలం 24 గ్రామపంచాయతీల్లో రూ. 41,63,556, జగదేవ్‌పూర్ మండలం 29 గ్రామపంచాయతీల్లో రూ.49,17,781, తొగుట మండలం 22 గ్రామ పంచాయతీల్లో రూ. 18,01,351, రాయపోల్ మండలం 19 గ్రామపంచాయతీల్లో రూ.12,93,641, సిద్దిపేట రూరల్ మండలం 14 గ్రామ పంచాయతీల్లో రూ.29,29,650, చేర్యాల మండలం 18 గ్రామ పంచాయతీల్లో రూ. 34,46,991, కొమురవెల్లి మండలం 11 గ్రామ పంచాయతీల్లో రూ.22,19,503, మిరుదొడ్డి మండలం 20 గ్రామ పంచాయతీల్లో రూ. 27,68,215, వర్గల్ మండలంలోని 27 గ్రామపంచాయతీల్లో రూ.98,91,881, కొండపాక మండలం 25 గ్రామ పంచాయతీల్లో రూ.65,55,108, సిద్దిపేట అర్బన్ మండలం 12 గ్రామ పంచాయతీల్లో రూ. 1,26,65,901, ములుగు మండలంలోని 26 గ్రామపంచాయతీల్లో రూ.2,23,15,884 చొప్పున పన్నులు వసూలు చేశారు. గ్రామ పంచాయతీ పన్నుల వసూలును వంద శాతం పూర్తి చేయడంతో మౌలిక వసతుల కల్పనకు దోహదపడనున్నాయి.

అందరి సహకారంతోనే సాధ్యమైంది

- దేవకీదేవి, జిల్లా పంచాయతీ అధికారి



జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూలు వంద శాతం పూర్తి చేశారు. కలెక్టర్ మార్గనిర్దేశం, గత పాలకవర్గం, ప్రత్యేకాధికారుల, కార్యదర్శుల భాగస్వామ్యంతో ప్రథమస్థానంలో నిలిచాం. పన్నుల వసూలులో ప్రజల చైతన్యం మరువలేనిది. పన్నుల వసూలు ద్వారా అభివృద్ధి పనులకు ఆటంకం ఉండదు.



హుస్నాబాద్ వారసంత వేలంలో పోటాపోటీ

● రూ. 1.20 కోట్లకు పైనే ఆదాయం
● గతేడాది కంటే అదనంగా రూ.40.25 లక్షల ఆదాయం

8లో

విద్యుత్ సమస్యలు తలెత్తకూడదు

● ఎస్ఈ మోహన్‌రెడ్డి



దాచారంలో సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ మోహన్ రెడ్డి

బెజ్జంకి, మార్చి 12: వేసవి దృష్ట్యా గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్‌శాఖ సిద్దిపేట ఎస్ఈ మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దాచారం, గుగ్గిళ్ల సబ్ స్టేషన్‌లను ఆయన మంగళవారం పరిశీలించి విద్యుత్‌శాఖ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు విద్యుత్ లైన్‌ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంతోపాటు, విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. గృహజ్యోతి పథకం కింద జీరో బిల్ రాని అర్హులైన లబ్ధిదారులు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హుస్నాబాద్ డీఈ శ్రీనివాసులు, ఏడీఈ మాణిక్యాలు, బెజ్జంకి, తోటపల్లి ఏఈలు బాలకిషన్, చాంద్ పాషా, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి ఇసుక కటకట

● నిలిచిపోతున్న నిర్మాణాలు ● ప్రభుత్వపాలసీ మాటున దోపిడీ

దుబ్బాక, మార్చి 12 : ఇంటి నిర్మాణం చేపట్టాలంటే సామన్యులకు తలకు మించిన భారమవుతుంది. నిర్మాణానికి అవసరమైన సామగ్రి ధరలు రోజురోజుకూ పెరుగుతుండగా మరోవైపు ఇసుక దొరక్క నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోతున్నాయి. రాష్ట్రం లో కాంగ్రెస్‌లో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక పాలసీ పేరుతో తాత్కాలికంగా ఇసుక రవాణాను నిలిపివేశారు. దీంతో స్థానికంగా ఉన్న వాగుల నుంచి వచ్చే ఇసుకకు డిమాండ్ పెరిగింది. రిచ్‌ల నుంచి ఇసుక విక్రయాలు నిలిపివేయడంతో దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో అనేక నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి.



కూడవెల్లి, మానేరు ఇసుకే ఆధారం

పదేళ్ల క్రితం దుబ్బాక నియోజకవర్గ ప్రజలు కూడవెల్లి వాగు నుంచి ఇసుకను తెచ్చుకుని ఇంటి నిర్మాణం చేపట్టేవారు. వారే కూలీలను, ట్రాక్టర్లను సమకూర్చుకుని ఇసుకను తెచ్చుకునే వారు. క్రమంగా ప్రభుత్వ పాలసీలు కఠినతరం కావడంతో ఇసుక వ్యాపారులకు బాగా కలిసొచ్చింది. గతంలో ట్రాక్టర్ 1800 లభించే ఇసుక క్రమంగా 4,800 నుంచి రూ.5,600 వరకు పెరిగింది. క్రమంగా కూడవెల్లి వాగు నుంచి స్థానిక అవసరాలకు ఇసుక తరలించే అవకాశం లేకపోవడం తో కాళేశ్వరం సమీపంలో ఉండే ఇసుక రిచ్‌లే ఆధారమయ్యా యి. అక్కడ కూడా వ్యాపారులు సిద్దిపేటకే పరిమితంగా ఇసుక అనుమతి పొందడంతో దుబ్బాకకు ఇసుక తీసుకురావాలం టే ఎక్కువ మొత్తంలోడిమాండ్ చేసేవారు. ఈ క్రమంలో రాజన్నసిరిసిల్ల జిల్లా నుంచి అక్రమంగా ఇసుక రవాణా సాగేది. అక్కడ కూడా ట్రాక్టర్ రూ.5,600 చొప్పున వసూలు చేసేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపడంతో సరిహద్దు గ్రామాల నుంచి వచ్చే ఇసుక ఆగిపోయింది. దీంతో పేదల సొంతింటి కలకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపడితే ఇసుక లభించక పనులు మధ్యలోనే ఆగిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. అధిక ధరలు చెల్లించి ఇసుకను తెప్పించుకుంటే స్థానికంగా ఉన్న అధికారుల నుంచి వేధింపు తప్పడం లేదని పలువురు చెబుతున్నారు. ప్రభుత్వం గతంలో మాదిరిగా స్థానిక అవసరాలకు సహజ వనరులను ఉపయోగించుకునేలా అనుమతులు ఇవ్వాలని, లేదంటే ప్రభుత్వం ఇసుకను సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.





అక్కన్నపేట మండలం జనగామ వాగులో ఇసుకను ట్రాక్టర్‌లో నింపుతున్న కూలీలు

జోరుగా అక్రమ రవాణా!

● అభివృద్ధి పనుల పేరిట దందా
● ట్రిప్ ఇసుకకు రూ.3వేల నుంచి రూ.5వేలు వసూలు
● పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు

అక్కన్నపేట, మార్చి 12 : అక్కన్నపేట మండలంలో ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు-ఆరు కాయలు అన్న చందంగా జోరుగా సాగుతున్నది. మండలంలోని అక్కన్నపేట, జనగామ, అంతకపేట, గౌరవెల్లి వాగుల నుంచి ప్రతిరోజూ ట్రాక్టర్లలను ఇసుకను తరలిస్తున్నారు. కొందరు అభివృద్ధి పనుల పేరిట అక్రమ రవాణా చేస్తు భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ పనులకు ఇసుకను తరలించేందుకు అనుమతులు ఇస్తే ఇదే అదునుగా ఇష్టారాజ్యంగా ఇసుకను సమీప గ్రామాల్లోని రహస్య ప్రదేశాల్లో భారీగా డంప్ చేస్తున్నారు. ట్రాక్టర్ ట్రిప్‌కు దూరాన్ని బట్టి రూ.3వేల నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో పాటు రెవెన్యూ, మైనింగ్‌శాఖ అధికారులు పూర్తిస్థాయిలో పట్టించుకోకపోవడంతో ఇసుక మాఫియా జోరుగా సాగుతున్నది. కొన్ని గ్రామాల్లో కిందిస్థాయి సిబ్బంది సహకరించడంతో వారిని అడిగేవారు కూడా కరువయ్యారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికారులు తూతూమంత్రంగా దాడులు చేసి రెండు, మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఈ దందా వ్యాపారంగా మారడంతో అధికారులు సైతం పాత్రధారులుగా మారిపోయారు. ఈ దందాలో అధికార పార్టీకి చెందిన నాయకులే ఉండడంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనుమతులు ఇవ్వలేదు

- ఇ. సంజీవ్‌కుమార్, తహసీల్దార్, అక్కన్నపేట



అక్కన్నపేట మండలంలోని వాగుల నుంచి ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులూ ఇవ్వలేదు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఇసుకను తరలించడానికి కూడా ఎవరికి పర్మిషన్లు ఇవ్వలేదు. సిబ్బంది తక్కువగా ఉండడం వల్ల ప్రత్యేక దృష్టి పెట్టలేకపోతున్నాం. పోలీసుల సహకారంతో ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

విద్యార్థులు మూఢవిశ్వాసాలు వీడాలి: ఎస్ఐ


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపతి

కోహెడ, మార్చి 12: సైన్స్‌తో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని, విద్యార్థులు మూఢవిశ్వాసాలు వీడాలని ఎస్ఐ తిరుపతి పేర్కొన్నారు. మంగళవారం కోహెడ మండల కేంద్రంలోని తంగళ్లపల్లి కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్య అవశ్యకత - మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఐ తిరుపతి హాజరై మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇప్పటికీ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు వీడకపోవడం దురదృష్టకరమన్నారు. స్త్రీ విద్యతో దేశాభివృద్ధి సాధ్యమని, విద్యార్థి దశలోనే మూఢనమ్మకాలు వీడి సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా ఆర్థిక మోసం చేస్తున్నారన్నారు. సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయకమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్ మాట్లాడుతూ దయ్యాలు, భూతాలు బూటకమని. సైన్స్ ఆధారంగా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. మ్యాజిక్ షో నిర్వహించిన నరేష్ ఇనుప కత్తిని కడుపులో గుచ్చుకోవడం, విద్యార్థి చేతిపై కిరోసిన్‌తో కాల్చడం, నోట్లో మంటలు లేపడం, గాలిలో విభూది సృష్టించడం లాంటి ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

గజ్వేల్, మార్చి 12: చట్టాలపై విద్యార్థులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా సూచించారు. మండల పరిధిలోని అహ్మదీపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో, గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్‌హబ్‌లో గల బాలికల పాఠశాల్లో విద్యార్థులకు బాలికలు, మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, గుడ్, బ్యాడ్ టచ్, మహిళల చట్టానికి గల చట్టాలు తదితర అంశాలను గూర్చి వివరించారు. తల్లిదండ్రుల కష్టాల్ని గుర్తుంచుకుని ఇష్టపడి చదువుకోవాలన్నారు. పదో తరగతి పరీక్షలు ఉన్నందున విద్యార్థులు క్రమశిక్షణ, ఏకాగ్రతతో చదువుకోవాలన్నారు. పోక్సో, బాల్యవివాహాల నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియాను అవసరమైన మేరకే వినియోగించుకోవాలని, అనవసరంగా ఇబ్బందులకు గురికావొద్దని సూచించారు. వారితో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

అర్హులందరికీ తెల్లరేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలి

- సిద్దిపేట రూరల్ మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

సిద్దిపేటరూరల్, మార్చి 12: కాళేశ్వరం ప్రాజెక్టులో ఏర్పడిన లోపాలతోనే రాష్ట్ర ప్రభుత్వం పొద్దు గడుపు తోందని సిద్దిపేట రూరల్ ఎంపీపీ శ్రీదేవి చందర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అర్హులైనవారికి ఆరు గ్యారంటీలు అందడం లేదన్నారు. తెల్ల రేషన్‌కార్డు లేక ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారని, వెంటనే అర్హులైన వారందరికీ తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని సభలో తీర్మానించారు. బోరు బావుల్లో నీటిమట్టం తగ్గి పంట పొలాలు ఎండిపోతున్నాయని, వెంటనే రంగనాయక సాగర్ ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేసి కాలువల ద్వారా మండలంలోని చెరువులను నింపాలని ఎంపీపీ తెలిపారు. ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. బండ చర్లపల్లి, రావురుకుల గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్నట్లు ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు తెలుపగా సంబంధిత అధికారులు సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సమస్యలను లేవనెత్తి సభ్యులు

మండలంలో పలుచోట్ల అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌స్తంభాలు ఇవ్వాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు కోరారు. చిన్న గుండవెల్లి మీదుగా దుబ్బాకకు బస్సును ప్రారంభించాలని పంచాయతీ కార్యదర్శి రమాదేవి కోరగా త్వరలో ప్రారంభిస్తామని ఆర్టీసీ అధికారి వెల్లడించారు. చింతమడక, తోర్నాల అటవీ ప్రాంతంలో జంతువులకు తాగునీటి ఏర్పాట్లు చేయాలని ఎంపీపీ ఉపాధ్యక్షుడు యాదగిరి కోరగా త్వరలోనే నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. పశువైద్యాధికారి డాక్టర్ చందన మాట్లాడుతూ మార్చి 15 నుంచి ఏప్రిల్ 15వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇస్తున్నట్లు తెలిపారు. మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో కుష్ఠువ్యాధి గ్రస్థుల గుర్తింపు సర్వే కొనసాగుతుందని ప్రజలు, ప్రజాప్రతినిధులు అధికారులు సహకరించాలని పుల్లూరు, నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు కోరారు. ఎంపీడీవో సమ్మిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని విశ్వకర్మ వృత్తిదారులు ఆన్‌లైన్ ద్వారా ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అవసరమైతే వారికి లక్ష నుంచి రెండు లక్షల వరకు బ్యాంకు రుణ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. ప్రభుత్వం అందించే గృహ జ్యోతి పథకం లబ్ధిదారులకు కరెంట్, గ్యాస్ బిల్లు సంబంధించిన సమస్యలు ఉంటే నేరుగా మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటి మండల వ్యాప్తంగా 97శాతం పన్నులు వసూలు చేసినట్లు తెలిపారు. కాగా మండల సర్వసభ్య సమావేశానికి ప్రత్యేక అధికారులు కొంత మంది గైర్హాజరయ్యారు. మండల సమావేశానికి సంబంధించి సమాచారం తనకు లేదని జడ్పీటీసీ శ్రీహరిగౌడ్‌కు వాపోయారు.

మహిళా ప్రజాప్రతినిధులకు సన్మానం

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపేట రూరల్ మండల పరిషత్ కార్యాలయంతో పాటు వివిధ శాఖలలో పని చేస్తున్న అధికారులను, మహిళా ప్రజా ప్రతినిధులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీదేవి మాట్లాడుతూ మహిళల భాగస్వామ్యం ఉన్నచోట అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు.

ఎల్లమ్మ చెరువును పర్యాటక కేంద్రంగా

అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు: కలెక్టర్


ఎల్లమ్మ చెరువు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

హుస్నాబాద్, మార్చి 12: హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నీటిపారుదలశాఖ ఈఈ రాములు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఈ విద్యాసాగర్‌లను కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. మంగళవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎల్లమ్మ చెరువును సందర్శించి దాని విస్తీర్ణం, వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని, నూతనంగా నిర్మించిన కళాశాల భవనాన్ని పరిశీలించారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య, ఇంత వివరాలను ప్రిన్సిపాల్ భిక్షపతిని అడిగి తెలుసుకున్నారు. డిగ్రీ కళాశాలను నూతన భవనంలోకి మార్చేందుకు అవసరమైన విద్యుత్, తాగునీరు తదితర సమస్యలను పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం మెడికల్ కాలేజీ నిర్మాణానికి పట్టణంలోని హన్మకొండ రోడ్డులో గుర్తించిన 30 ఎకరాల భూమిని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొని వ్యాపారి దుర్మరణం


కొంగరి యాదగిరి(ఫైల్)

రాయపోల్, మార్చి 12: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో పాత ఇనుపసామాన్లు కొనుగోలు చేసే వ్యాపారి అక్కడికక్కడే దుర్మరణం చెందగా, ద్విచక్రవాహనం లారీ ముందు భాగంలో ఇరుక్కుపోవడంతో రెండు కిలోమీటర్ల దూరం ఈడ్చుకుపోయింది. ఈ ఘటన రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి సమీపంలో చోటు చేసుకున్నది. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ గ్రామానికి చెందిన కొంగరి యాదగిరి(55) గత పదేళ్లుగా పరిసర గ్రామాల్లో తిరుగుతూ పాత ఇనుప సామాన్లను కొనుగోలు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడు ఎంతో కష్టపడి తన నలుగురు కూతుళ్ల వివాహాలు చేశాడు. మంగళవారం ఉదయం తన ద్విచక్ర వాహనమైన టీవీఎస్ ఎక్సెల్‌పై పాత ఇనుప సామాన్లు కొనేందుకు బయలుదేరాడు. ఈ క్రమంలో అంకిరెడ్డిపల్లి సమీపంలో రహదారిపై వెళ్తున్న అతడి వాహనాన్ని గజ్వేల్ నుంచి చేగుంట వైపు వెళ్తున్న ఓ లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో యాదగిరికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా లారీ ముందు భాగంలో ఇరుక్కున టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని డ్రైవర్ భయంతో రెండు కిలోమీటర్ల దూరం ఈడ్చుకువెళ్లి అక్కడే వదిలి లారీతో పరారయ్యాడు. మృతుడి పెద్ద కూతురు అంత్యక్రియలు నిర్వహించింది. లారీ హెచ్ఆర్ రిజిస్ట్రేషన్‌తో ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడి భార్య భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చిన్న కోడూరులో ట్రాక్టర్ తగిలి ధ్వంసమైన విగ్రహాలు


గద్దె కూలి ధ్వంసమైన విగ్రహాలు

చిన్నకోడూరు, మార్చి 12 : గ్రామ పంచాయతీ ట్రాక్టర్ తగిలి సావిత్రి బాయి, జ్యోతిరావుపూలే విగ్రహాలు ధ్వంసమైన సంఘటన చిన్నకోడూరు మండల కేంద్రంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం గ్రామపంచాయతీ ట్రాక్టర్ చెత్త సేకరణ కోసం బయలుదేరింది. స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో డివైడర్ నుంచి ట్రాక్టర్‌ను మలుపు తిప్పుతున్న క్రమంలో విగ్రహాల గద్దెకు తగిలింది. దీనితో గద్దె నేలపై పడి విగ్రహాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటన పై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

జీవనాధారం పోయింది.. పరిహారమూ దక్కలేదు

- కొండపాకలో రోడ్డుపైనే రాళ్లగోడ కట్టి బాధితుడి నిరసన



రోడ్డుకు అడ్డంగా కట్టిన రాళ్ల గోడ, రోడ్డు వెడల్పులో కోల్పోయిన ఇల్లు

కొండపాక, మార్చి 12 : రోడ్డు వెడల్పులో ఇంటిని కోల్పోయి ఏడాది గడిచినా పరిహారం అందకపోవడంతో న్యాయం చేయాలంటూ కొండపాకకు చెందిన వెల్కటూరు బాలయ్య అనే వ్యక్తి నిరసనకు దిగాడు. తన ఇంటి ముందే రోడ్డుకు అడ్డంగా రాళ్లు పెట్టి గోడ కట్టి నిరసన వ్యక్తం చేశాడు. మండల కేంద్రమైన కొండపాకలో రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా పలువురు ఇళ్లను కోల్పోయారు. ఒప్పందం ప్రకారం ఇళ్లు కోల్పోయిన సుమారు 50 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించారు. కొంతమంది తమ ఇళ్లను కూల్చివేయడానికి ఒప్పుకోలేదు. అందులో గ్రామానికి చెందిన వెల్కటూరు బాలయ్య అనే వ్యక్తి రోడ్డు వెడల్పు తన ఇంటి ముందు భాగం వరకే వస్తుందని అలాగే ఉంచాడు. కానీ మార్కింగ్ ప్రకారం ముందు భాగం వెడల్పులో పోతుంది. ఈ విషయాన్ని గ్రామస్థులు, పెద్దలు నచ్చజెప్పారు. అయితే పరిహారంగా డబుల్ బెడ్ రూమ్ ఇవ్వని పక్షంలో రూ.10 లక్షలు ఇస్తామని డీసీసీబీ చైర్మన్ దేవేందర్ రెడ్డి తో పాటు పలువురు స్థానిక నాయకులు ఒప్పంద పత్రం రాసిచ్చారు. దాంతో ఆయన ఇంటిముందు ఉన్న రెండు షెటర్లను తానే సొంత డబ్బు ఖర్చు చేసుకొని కూల్చివేశాడు. ఏడాది కాలం గడిచినా పరిహారం రాలేదు. డబుల్ బెడ్‌రూమ్ కూడా ఇవ్వలేదు. ఎవరిని అడిగినా నిర్లక్ష్యమైన జవాబే వచ్చింది. విసుగు చెందిన బాధితుడు రోడ్డుపై రాళ్లు పేర్చి అడ్డంగా గోడ కట్టి మంగళవారం నిరసన వ్యక్తం చేశాడు. పరిహారం డబ్బు కావాలని వేడుకున్నాడు. పోలీసులు చేరుకొని రోడ్డుపై గోడ కట్టడం సరికాదని తీసివేయాలని నచ్చజెప్పారు. తనకున్న రెండు షెటర్లు కోల్పోవడంతో జీవనాధారం కోల్పోయానని, న్యాయం చేయాలంటూ బాలయ్య అధికారులను వేడుకున్నాడు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

చేర్యాల, మార్చి 12: చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షురాలి భర్త పెద్దింటి చంద్రమౌళి(45) మృతి చెందడంతో మంగళవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సంతాపం వ్యక్తంచేశారు. మృతుడి కుటుంబీకులను ఎమ్మెల్యే పల్లా ఫోన్‌లో పరామర్శించారు. కుటుంబానికి ధైర్యం చెప్పి రూ.5వేలు ఆర్థికసహాయం అందించారు. ఎమ్మెల్యే తరఫున మాజీ సర్పంచు పెడుతల ఎల్లారెడ్డి, మీస పార్వతి మృతుడి కుటుంబసభ్యులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

భారత రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు

రాయపోల్, మార్చి 12: దళిత బహుజనఫ్రంట్ ఆధ్వర్యంలో మంగళవారం రాయపోల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భారత రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ విద్యార్థులందరూ రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి, డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణు తదితరులుపాల్గొన్నారు.

'గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి'

కొమురవెల్లి, మార్చి 12 : గ్రామాలలో ప్రత్యేక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ తలారి కీర్తన సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సభలో పలు శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రాజేందర్ రెడ్డి, తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటితో చెరువులు నింపాలని కోరారు. ఎంపీపీ వ్యవసాయ శాఖ సమీక్షలో వరి పంటలో మోగి పురుగు ఉధృతి నివారణకు సూచనలు చేస్తూ అవసరమైన ఫర్టిలైజర్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

హుస్నాబాద్ వారసంత వేలంలో పోటాపోటీ

- రూ. 1.20 కోట్లకు పైనే ఆదాయం
- గత ఏడాదికంటే అదనంగా రూ.40.25 లక్షల ఆదాయం


నంగునూరు: రాంపూర్

హుస్నాబాద్, మార్చి 12: హుస్నాబాద్ పట్టణంలో ప్రతీ శుక్రవారం జరిగే వారసంతకు నిర్వహించిన వేలంలో రూ. 1,20,26,000 ఆదాయం వచ్చింది. గతంలో ఎప్పుడూ ఇంత ఆదాయం రాలేదు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ ఆకుల రజిత సమక్షంలో ఈ అంగడికి బహిరంగ వేలం నిర్వహించారు. వారసంతను దక్కించుకునేందుకు కాంట్రాక్టర్లు పోటాపోటీగా వేలం పాడారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ కార్యక్రమం సాగింది. 23 మంది టెండర్లు వేసి వేలం పాటలో పాల్గొన్నారు. గత ఏడాది రూ. 80లక్షల ఆదాయం రాగా రూ. 88 లక్షల నుంచి వేలాన్ని ప్రారంభించారు. అందరికంటే ఎక్కువ కరీంనగర్ జిల్లా గంగాధరకు చెందిన రుద్రక్ష శ్రీనివాస్ అనే కాంట్రాక్టర్ రూ. 1,20,26000 వేలం పాడి అంగడిని దక్కించుకున్నారు. ఈ సారి అదనంగా రూ.40.25 లక్షల ఆదాయం అధికంగా వచ్చింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు పెరుక భాగ్యరెడ్డి, దొడ్డి శ్రీనివాస్, వల్లపు రాజు, అయిలేని శంకర్‌రెడ్డి, జనగామ రత్న, మ్యాదరబోయిన వేణు, కోమటి స్వర్ణలత తదితరులున్నారు.

రూ.800 నుంచి రూ. 1.20 కోట్ల వరకు

ప్రస్తుతం తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన హుస్నాబాద్ వారసంత రూ. 800 ఆదాయంతో ప్రారంభమై ప్రస్తుతం రూ. 1.20 కోట్లకు చేరింది. ప్రతీ శుక్రవారం జరిగే ఈ అంగడిని 1956లో ప్రారంభించారు. యేటా దీని ఆదాయం పెరుగుతూవస్తోంది. హుస్నాబాద్ పట్టణ అభివృద్ధికి ఈ అంగడి ద్వారా 40శాతం నిధులు సమకూరుతున్నాయి. అయితే ఆదాయం వస్తున్నా సంతను మాత్రం అభివృద్ధి చేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఉపాధిహామీలో అన్నీ అవకతవకలే

- మృతుడు పని చేసినట్టుగా చూపించి చెల్లింపులు
- సోషల్ ఆడిట్‌లో బయటపడిన వైనం


సామాజిక తనిఖీలో వెల్లడైన అంశాలను వెల్లడిస్తున్న వీఎస్ఏలు

మద్దూరు, మార్చి 12 : మద్దూరు ఉమ్మడి మండలంలో ఏప్రిల్ 1, 2022 నుంచి మార్చి 31, 20243 వరకు నిర్వహించిన ఉపాధిహామీ పనులపై నిర్వహించిన 15వ సామాజిక తనిఖీలో అవకతవకలపై జడ్పీటీసీ గిరికొండల్‌రెడ్డి, అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ నిర్వహించిన విలేజ్ సోషల్ ఆడిటర్స్ ప్రజావేదికలో తనిఖీలో వెల్లడైన అంశాలను చదివి వినిపించారు. గ్రామపంచాయతీల్లో 7 రకాల రిజిష్టర్లను మెయింటెయిన్ చేయలేదని, రోజ్‌గార్ దివస్‌పై కూలీలకు అవగాహన ఏర్పాటు చేయలేదని, కూలీలకు కొత్త అకౌంట్లు ఇప్పించి బిల్లుల చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహించారని సభ దృష్టికి తీసుకువచ్చారు. మస్టర్‌లో సంతకాలు లేకుండా పేమెంట్స్ చేపట్టారని తెలిపారు. ఎంబీ రికార్డులో ప్లాంటేషన్, వేస్ట్ ల్యాండ్‌లో మొక్కలు లేకున్నా ఎక్కువ పేమెంట్స్ చేశారని వెల్లడించారు. పని ప్రదేశంలో కూలీలకు ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయలేదన్నారు. మస్టర్‌లో పని చేసిన దాని కంటే ఎక్కువ పేమెంట్స్ చెల్లించారని తెలిపారు. క్రీడా ప్రాంగణాల కొలతల్లో తేడాలున్నాయని ఎక్కువ డబ్బులు చూపించారని వివరించారు. అలాగే లద్నూరులో 2019లో చనిపోయిన వ్యక్తి 2022లో పనిచేసినట్లుగా చూపించి రూ.వెయ్యి చెల్లించారని తెలిపారు. కూటిగల్‌లో 3 మీటర్ల వెడల్పు గల 115 మెట్లు తీసినట్లు తప్పుడుగా చూపించారని దీనికి గానూ రూ.28,980 చెల్లించారని తెలిపారు. అంతకు ముందు జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధిహామీలో కూలీలకు న్యాయం జరిగేలా ఉండాలన్నారు. కనీసం రోజ్‌గార్ దివస్‌పై అవగాహన కల్పించలేని పరిస్థితుల్లో ఉండటంతో ఉపాధిహామీ అధికారులపై మండిపడ్డారు. అవకతవకలపై చర్యలు తీసుకోనున్నట్లు అడిషనల్ పీడీ బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంమోహన్, శ్రీనివాస్‌గౌడ్, అంబుడ్స్ పర్సన్ ఆరీఫ్ అలీసాబెరి, ఏపీవో ప్రభాకర్, ఎస్ఆర్పీ దేవేందర్‌తో పాటు వీఎస్ఏలు ఈసీ పర్శరాములు, టీఏలు, పీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థలో స్త్రీ పాత్ర గొప్పది


జిల్లా ఆసుపత్రిలో డాక్టర్‌ను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

గజ్వేల్, మార్చి 12: కుటుంబ వ్యవస్థలో స్త్రీ పాత్ర గొప్పదని గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయి కిరణ్ పేర్కొన్నారు. గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న సమాజంలో ఆడవాళ్లదే పైచేయిగా ఉందన్నారు. ముఖ్యంగా వైద్య వృత్తిలో వారి సేవలు మరువలేనివన్నారు. అనంతరం డాక్టర్ త్రివేది మాట్లాడుతూ నేడు సమాజ అభివృద్ధిలో మహిళ ప్రథమ పాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ శానిటేషన్ హెల్త్ చైర్మన్ కరుణాకర్ రెడ్డి, పూర్వాధ్యక్షుడు బాపురెడ్డి, దాస జగదీశ్వర్, నరసింహారెడ్డి, ఆసుపత్రి సిబ్బంది నరసింహులు, వాసు, శాంతి కుమారి, మరియా పోచమని, లక్ష్మి, రోజ్‌మేరీ పాల్గొన్నారు.

కూటిగల్‌లో హుండీ ఆదాయం రూ.లక్ష పైనే..

దూళిమిట్ట, మార్చి 12: మండలంలోని కూటిగల్ సమ్మక్కసారలమ్మ జాతర హుండీ ఆదాయం రూ.1.04.511లు వచ్చాయని జాతర కమిటీ ఛైర్మన్ కొండూరి శ్రీనివాస్ తెలిపారు. వెండి తొట్టెలు 9, వెండి బిల్లలు 5, వెండి కడియం 1, ఒక వెండి రేకు ముక్కలు కలిపి సుమారు 20 తులాల వెండితో పాటు రెండు పుస్తెలు, రెండు తీగలు లభ్యమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

టెండర్ డబ్బు ఇవ్వకపోవడంతో వైన్స్ వద్ద ఆందోళన

దూళిమిట్ట, మార్చి 12 : మండలంలోని కూటిగల్‌లో సమ్మక్క సారలమ్మ జాతరలో మద్యం అమ్మకాలకు వేలం పాటలు దక్కించుకున్న వైన్స్ నిర్వాహకులు టెండర్ డబ్బు చెల్లించకపోవడంతో షట్టరు మూసి కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న మద్దూరు పోలీసులు కూటిగల్ గ్రామానికి వెళ్లి ఇరువురి శాంతింపజేసి షట్టరు తెరిపించారు. అనంతరం బండి కృష్ణ, జాతర కమిటీ చైర్మన్ శ్రీనివాస్, బూర్గు సుధాకర్‌తో పాటు మరో పది మందిని ఏఎస్ఐ జగదీశ్వర్ అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి విషయాలను అడిగి తెలుసుకున్నారు. జాతరలో మద్యం అమ్మకాలకు టెండరు దక్కించుకున్న సత్యవైన్స్ షాపు నిర్వాహకులు టెండరు డబ్బులు ఇవ్వకుండా జాప్యం చేస్తుండటంతో, ఫోన్ చేసినా స్పందించకపోవడంతో షట్టరు కిందికి వేసి నిరసన తెలిపామన్నారు. అనంతరం ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ మాట్లాడుతూ.. వైన్స్ ఓనర్‌ను విచారించి తగుచర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజబోయిన రాజు ముదిరాజ్



సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 12: హైదరాబాద్‌లో జరిగిన మెపా (ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్రం) రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సిద్దిపేట పట్టణానికి చెందిన రాజబోయిన రాజు ముదిరాజ్‌ను ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, ప్రధాన కార్యదర్శి బోట్ల పల్లి సంజీవన్ కుమార్‌లు నియామక పత్రాన్ని రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ జాతి అభివృద్ధి, ఐక్యత కోసం అందరినీ కలుపుకుని ముందుకు వెళతానన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం తగదు: జడ్పీటీసీ

మద్దూరు, మార్చి 12 : పేదలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మద్దూరు పీహెచ్‌సీని గిరి కొండల్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సమయానికి విధులకు రాని వారిపై ఆరా తీశారు. ముందస్తుగా విధులకు హాజరుకాకున్నా సంతకాలు పెట్టుకోవడంపై మండిపడ్డారు. ఆలస్యంగా విధులకు హజరైన వైద్యాధికారిపై మండిపడ్డారు. ఈ విషయమై జిల్లా వైద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

నేడు మంత్రిచే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హుస్నాబాద్ టౌన్, మార్చి 12 : హుస్నాబాద్ పట్టణంలో రూ. 18.50 కోట్లతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఉదయం శంకుస్థాపన చేయనున్నారు. సీసీ రోడ్లు, మురికి కాలువలు, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. కార్యక్రమం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉంటుందని పేర్కొన్నారు.

తపాస్‌పల్లి రిజర్వాయర్‌తో చెరువులు నింపాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల, మార్చి 12: తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా చేర్యాల ప్రాంతంలోని చెరువులు, కుంటల్లో గోదావరి జలాలు నింపి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్‌చేస్తూ సీపీఎం నాయకులు మంగళవారం చేర్యాల తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో మాట్లాడుతూ.. పంటలు ఎండిపోతున్నాయని, తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా చెరువులు, కుంటలను నింపే అవకాశం ఉన్నా పట్టించుకోకపోవడం తగదన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు సమీర్ అహ్మద్‌ఖాన్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బండకింది అరుణ్‌కుమార్, దాసరి ప్రశాంత్,రాళ్లబండి నాగరాజు, మోకు దేవేందర్‌రెడ్డి , నాగపురి కనకయ్య పాల్గొన్నారు.

మద్దూరు మండలంలో..

మద్దూరు, మార్చి 12: లద్నూరు రిజర్వాయర్ ద్వారా మద్దూరు ఉమ్మడి మండలంలోని చెరువులు, కుంటలు నింపాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మద్దూరు, దూళిమిట్ట తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ అనంతరెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలకు రూ.50 వేల విలువైన పుస్తకాల అందజేత


పాఠశాలలోని గ్రంథాలయంలో పుస్తకాలు

దూళిమిట్ట, మార్చి 12: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రవాస భారతీయ వాసవీ అసోసియేషన్ రూ.50 వేల విలువ చేసే దాదాపు 360 పుస్తకాలను అందజేసినట్టు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా విద్యార్థులు జ్ఞానాన్ని, భాష నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. పాఠశాలకు పుస్తకాలను అందజేసిన ప్రవాస భారతీయ వాసవీ అసోసియేషన్‌వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏంఈవో నర్సింహారెడ్డి, ప్రధానోపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్మెట హైస్కూల్‌లో డీఈవో ఆకస్మిక తనిఖీ



విద్యా కమిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న డీఈవో

నంగునూరు, మార్చి 12 : మండలంలోని నర్మెట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. టెన్త్ విద్యార్థులతో మాట్లాడి ఉత్తమ ఫలితాల కోసం పలు సూచనలు చేశారు. దాతల సహకారంతో పాఠశాలలో చేసిన అభివృద్ధిని చూసి ఎంఈవో తగిరెడ్డి దేశిరెడ్డి, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. పాఠశాల అభివృద్ధికి విద్యాకమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు తన వంతుగా రూ.1.50 లక్షలు అందించినందున ఆయనను డీఈవో శాలువాతో సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులు డీఈవోను శాలువాతో సత్కరించారు.

ఘనంగా శ్రీ ఉమామహేశ్వర స్వామి రథోత్సవం


మర్కుక్: అంగడి కిష్టాపూర్‌లో ఉమామహేశ్వర రథోత్సవం

మర్కుక్, మార్చి 12: మండలంలోని అంగడి కిష్టాపూర్‌లో మంగళవారం శ్రీఉమామహేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు రథోత్సవంతో ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ లక్ష్మీరాములుగౌడ్, మాజీ ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, కార్పొరేటర్ రోజా శ్రీనివాస్‌గుప్తా పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వెంకట నరసింహశర్మ, సహాయకులు వీరేశం, నాయకులు తిరుపతి రెడ్డి, మీసాల శ్రీనివాస్‌రెడ్డి, అక్కారం బాలచంద్రం, నాగేష్, గోవర్ధన్, చారి, గుడాల అశోక్ మల్లారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


మద్దూరు: గాగిళ్లాపూర్‌లో శివపార్వతుల కల్యాణోత్సవం

గాగిళ్లపూర్‌లో వైభవంగా శివకల్యాణం

మద్దూరు, మార్చి 12 : మండలంలోని గాగిళ్లాపూర్ శివాలయంలో ధ్వజస్తంభ, నాగ, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహప్రతిష్ఠాపన 6వ వార్షికోత్సవంలో భాగంగా తెల్లవారుజామున శివుడికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు ఆగాచారీ వైదిక నిర్వాహణలో అర్చకుడు విఠల్, అజయ్ రుద్ర హోమం జరిపించారు. అనంతరం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, మాజీ సర్పంచ్ బొల్లు కృష్ణవేణిచంద్రమౌళి పాల్గొన్నారు.

స్నేహానికన్న మిన్న.. లోకాన లేదురా!

మరణించిన స్నేహితురాలి కుటుంబానికి అండ


డిపాజిట్ చేసిన రసీదును మృతురాలి కుమార్తెకు అందజేస్తున్న స్నేహితులు

ధూళిమిట్ట, మార్చి 12 : స్నేహానికన్న మిన్న లోకాన లేదు రా అన్నాడో సినీకవి. ఆ మాటను నిజం చేశారు ఆ స్నేహితులు. ఇటీవల కన్నుమూసిన తమ స్నేహితురాలి కుటుంబానికి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. దూళిమిట్ట మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన పోతుగంటి మహేశ్వరి ఇటీవల మృతి చెందగా, ఆమెకు ఓ కుమార్తె ఉంది. వారిది నిరుపేద కుటుంబం. ఈ విషయం తెలిసిన మహేశ్వరి పదో తరగతి (2005-06) బ్యాచ్ స్నేహితులు ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. అంతా కలిసి తలా కొంత వేసుకుని రూ. 85 వేలను సేకరించారు. ఆ డబ్బును మహేశ్వరి కుమార్తె పేరిట పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి మంగళవారం రసీదును అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలిచిన పాత స్నేహితులను గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో గద్దల మహేందర్, శ్రీనివాస్, అఖిలేష్ రెడ్డి, రవి, రాము పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యం

జగదేవ్‌పూర్, మార్చి 12: సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని కొండపోచమ్మ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు న్యాలమడుగు హన్మంతరెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలో భాగంగా సోమవారం భద్రాచలంలో సీఎం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంగళవారం జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడపలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మచ్చేందర్‌రెడ్డి, ప్రసాద్, వెంకటస్వామి, లింగప్ప, కిషన్ యాదవ్, శ్రీనివాస్, మధుకర్, నాగులుయాదవ్, జగదీష్, కుమ్మరి భాను, గుర్రం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బాల్యవివాహాల నిరోధంపై అవగాహన

మిరుదొడ్డి, మార్చి 12: ప్రజలు బాల్యవివాహాలపై అవగాహన కల్గి ఉండాలని మిరుదొడ్డి ఎస్ఐ పరశురాములు పేర్కొన్నారు. మంగళవారం మిరుదొడ్డి మండలం అందె గ్రామంలో సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, మహిళల రక్షణ చట్టాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సామాజిక రుగ్మతలపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయులు, షీటీం బృందం పాల్గొన్నారు.

పల్లెల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం

దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

రాయపోల్, మార్చి 12: పల్లెల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన రాయపోల్ మండలం మంతూర్, అనాజీపూర్, కొత్తపల్లి గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న మహిళా సంఘం భవనాలకు, రాయపోల్‌లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్, మాజీ ఏఎంసీ చైర్మన్ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

- **మిరుదొడ్డి:** దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్పవ్యక్తి మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి అని కాంగ్రెస్‌పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. మంగళవారం మిరుదొడ్డి మండలం అల్వాల చౌరస్తాలో మాజీ మంత్రి చెరుకుముత్యం రెడ్డి విగ్రహాన్ని కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసిఆవిష్కరించారు. ఆయన వెంట తాజామాజీ సర్పంచులు కిష్టయ్య శంకర్, భూపతి, నాయకులు భూమాగౌడ్, ఏదుల్, రాజేశం, సుదర్శన్, కుమార్, హర్షద్ తదితరులున్నారు.